ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

అక్రమాలపై కొరడా

ఎనీవేర్ పేరిట ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం

- భూ ఆక్రమణదారులతో అధికారుల కుమ్మక్కు
- నిషేధిత జాబితాలో ఉన్న భూములు సైతం రిజిస్ట్రేషన్
- కడప రింగు రోడ్డు చుట్టూ పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు
- ఫిర్యాదులు రావడంతో రద్దుకు కలెక్టర్ ఆదేశం


కడప చుట్టూ ఉన్న రింగు రోడ్డు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల హయాంలో ఎన్నడూ లేనివిధంగా భూకుంభకోణాలు జరిగాయి. అడ్డగోలుగా కోట్లాది రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించారు. దీనికి కొందరు రెవెన్యూ అధికారులే కాదు రిజిస్ట్రేషన్ అధికారులు కూడా పూర్తిగా సహకరించారు. వెరసి కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కొల్లగొట్టేశారు. నాటి వైసీపీ పాపాల పుట్ట ఇప్పుడు బద్దలవుతూ వస్తోంది.

కడప నగరం సీకేదిన్నె, వల్లూరు, చెన్నూరు రెవెన్యూ పరిధిలో విస్తరించి ఉంది. సీకేదిన్నె రెవెన్యూ పరిధిలో ఉన్న రింగురోడ్డు చుట్టూ విలువైన భూములున్నాయి, మామిళ్లపల్లె, తాడిగొట్ల, క్రిష్ణాపురం, ఊటుకూరు, చెర్లోపల్లె, రామచంద్రాపురం, కొప్పర్తి ప్రాంతాల్లో రింగురోడ్డు ఆనుకుని ఉన్న భూములు ఎకరం రూ.2కోట్లు పైమాటే ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలూ వెలుస్తున్నాయి. వీటిలో కొన్ని భూములు 22-1ఏలో అంటే నిషేధిత జాబితాలో ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ భూములు, ఎండోమెంటు, వక్ఫ్, చుక్కలు భూములు, అసైన్డ్ ల్యాండ్స్ ఉంటాయి. ఈ భూముల్లో రిజిస్ట్రేషన్ చేయకూడదు. ఎక్స్ ఆర్మీ ఉద్యోగులకు ప్రభుత్వం డీకేటీ భూములు ఇచ్చింది. ఆ భూములు ఇచ్చాక పదేళ్లు దాటితే వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇవి పొరపాటున నిషేధిత జాబితాలో ఎంటర్ అయితే వాటిని తొలగించేందుకు కలెక్టరుకు దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి రికార్డులన్నీ పక్కాగా ఉంటే నిషేధిత జాబితాలో నుంచి తొలగిస్తారు. అప్పుడు ఆ 22-1ఏలో నిషేధిత జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌ను తీసుకువచ్చింది. దీని ప్రకారం ఆస్తులను ఏ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అయినా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అయితే దీన్ని కొందరు వైసీపీ నేతలు తమకు అనుకూలంగా వాడుకున్నారు. కడప, సీకే దిన్నె, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి, బిమఠం, సింహాద్రిపురంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌ను ఉపయోగించుకుని అడ్డగోలుగా నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వాటిపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

భూమాఫియాతో రిజిస్ట్రార్లు కుమ్మక్కు

నిషేధిత జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదని స్పష్టంగా నిబంధనలున్నా కొందరు రిజిస్ట్రార్లు భూ మాఫియాతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేయించారు. వైసీపీ హయాంలో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని అవినీతి తిమింగళాలు పనిచేశాయి. విలువైన భూముల్లో వాటా ఇస్తే చాలు.. సాక్షాత్తు వారుంటున్న సబ్ రిజిస్ట్రారు కార్యాలయమే కాదు కలెక్టరేట్ కూడా రిజిస్ట్రేషన్ చేయించేలా అవినీతి అనకొండలు పనిచేశారు. వారి హయాంలోనే కడప శివారులోని సీకేదిన్నె మండలంలో కోట్లాది రూపాయల విలువచేసే భూములను కొందరు వైసీపీ నేతలకు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇవి నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ జరగలేదని ఇటీవల రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు గుర్తించి ఆ డాక్యుమెంట్లను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి పంపించారు. ఆయన వాటిని పరిశీలించి ఆ రిజిస్ట్రేషన్ల రద్దుకు ఆదేశించారు.

రద్దు ఎక్కడెక్కడంటే..

సీకేదిన్నె రెవెన్యూ పరిధిలో నిషేధిత జాబితాలో ఉన్న 72 డాక్యుమెంట్లను గుర్తించారు. వాటి రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యధికంగా మామిళ్లపల్లె రెవెన్యూ పొలంలో 30 డాక్యుమెంట్లు రద్దు చేయగా, తాడిగొట్ల రెవెన్యూ డివిజను 14, ఊటుకూరు 11, కొప్పర్తి 8, విశ్వనాధపురం 2, క్రిష్ణాపురం 2, రామచంద్రాపురం 1, మరికొన్ని చోట్ల డాక్యుమెంట్లను రద్దు చేశారు. ఇవన్నీ 2019 నుంచి 2022 మధ్యనే రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. అలాగే బద్వేలు రిజిస్ట్రేషన్ పరిధిలోని బి.మఠం, కడప రూరల్ పరిధిలో చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి.. పులివెందుల పరిధిలోని సింహాద్రిపురంలో అక్రమ రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేయనున్నారు. కలెక్టర్ రద్దు చేసిన వాటిలో రూ.100కోట్లకు పైగా విలువ చేసే భూములు, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇవి కాకుండా లేఅవుట్లలోని ప్లాట్లు కూడా ఉన్నాయి. వీటి విలువ రూ.200 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌తో నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులను అడ్డగోలుగా కొట్టేయాలనుకున్న వారికి కలెక్టర్ చర్యలు మింగుడుపడడం లేదు.



కడప రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పెద్దదర్గా ఉర్సుకు ప్రత్యేక స్థానం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


పూలచాదర్ తీసుకెళుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప కల్చరల్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): పెద్దదర్గా ఉర్సు ఉత్సవాలతో ప్రపంచ పటంలో కడపకు ప్రత్యేక స్థానం దక్కుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున చాదర్ సమర్పించారు. ఈ మేరకు గురువా రం స్థానిక వన్‌టౌన్ సమీపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకతీతంగా కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు జరగడం ఆనవాయితీగా వస్తోందన్నా రు. 2017 నుంచి ప్రభుత్వం తరపున దర్గా ఉత్సవాలకు చాదర్ సమర్పి స్తున్నామన్నారు. అనంతరం చాదర్‌ను కలెక్టర్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తలపై పెట్టుకుని దర్గాకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్డీఓ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, టీడీపీ నాయకులు హరిప్రసాద్, అమీర్‌బాబు, జిలానీబాషా, మైనార్టీ నాయకులు సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందాలి

కడప కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామాల్లో కొరత లేకుండా సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల పురోగతిపై డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీరు అందించేందుకు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పులివెందుల వాటర్ గ్రిడ్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందించేందుకు చేస్తున్న పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో క్లోరినేషన్ సిస్టమ్‌ను, ఎఫ్‌టికే పనితీరు నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా తాగునీరు కలుషితమైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఏడుకొండలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేకమ్మ


కుక్కపిల్లకు పాలు ఇస్తున్న మేక

వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన నూకనబోయిన రాఘవ ఇంట్లో మేకలున్నాయి. వీటిలో ఒక మేక ఇటీవల ఈనింది. అయితే ఆ మేకపిల్ల మృతి చెందింది. పక్కన ఇంటిలో కుక్కపిల్లలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఇలా మేక వద్ద పాలు తాగుతోంది. మేక కుక్కపిల్లకు పాలు ఇవ్వడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.


\- వీరపునాయునిపల్లె

ఎస్‌ఐల బదిలీ

కడప క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీచేస్తూ ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులు డీఎస్‌బీ కడప, అబ్రహంను కడప మహిళా పోలీస్ స్టేషన్‌కు, సుబ్బారాయుడును సీసీఎస్ కడపకు, శ్రీనివాసులును ఒంటిమిట్టకు బదిలీ చేశారు. ప్రొద్దుటూరు టూటౌన్‌లో పనిచేస్తున్న ధనుంజయుడును దువ్వూరుకు బదిలీ చేశారు.

ప్రతి నిరుపేదకు భూ పంపిణీయే లక్ష్యం

- గ్రామాల్లో పక్కాగా భూ సర్వే జరగాలి
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, నవం బరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి నిరుపేదకు భూము లను పంపిణీ చేయాల న్నదే తన జీవితాశయ మని మైదుకూరు ఎమ్మె ల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. గురు వారం బి.మఠం ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్రహ్మం గారిమఠం మండంలంలో ఒకేభూమిపై ఇద్దరు ముగ్గురికి పత్రాలున్నాయని అన్నారు. దీంతో తరచూ సమస్యలు వస్తున్నాయన్నా రు. మండలంలో ప్రస్తుతం 7,512 మంది దొంగపట్టాలను తయారు చేసుకుని 14,661 ఎకరాలు అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. ఈ మేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు వివరాలన్నీ ఇచ్చామన్నారు. ఇప్పటికే మండలంలో భూకబ్జాదారుల వివరాలను గుర్తించామన్నారు. ప్రస్తుతం న్యాయంగా ఉన్న రైతన్నల భూములు ఎక్కడికీ పోవని, వారికి రాబోవు రోజుల్లో సమస్యలు రాకుండా పక్కాగా భూరికార్డుల్లో ఎక్కించి ఇస్తామన్నారు. మండలంలో అసైన్‌మెంటు కమిటీ ద్వారా ప్రతి రైతుకు, ప్రజలకు భూములు పంపిణీ చేస్తామన్నారు. గతంలో అధికారులు భూములను ఇష్టానుసారంగా ఆన్‌లైన్ చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రాజకీయ నాయకులు కూడా భూసర్వేకు సహకరించాలని కోరారు. రాబోవురోజుల్లో రాష్ట్రంలోనే బ్రహ్మంగారిమఠం మండలం పైలెట్ మండలంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శిరీషా, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దారు కార్తీక్, జిల్లా సర్వేయర్ ఏడీ మురళీక్రిష్ణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాఠశాలలకు వర్కింగ్‌డే

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అక్టోబరు 27, 28, 29 తేదీలలో పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించిన నేపథ్యంలో.. దానికి బదులుగా నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లోని రెండో శనివారాన్ని పాఠశాలల్లో పనిదినాలుగా నిర్వహించాలని డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ పాఠశాలలకు మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో కోటి సంతకాల కార్యక్రమం నిషేధం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోటి సంత కాల సేకరణ పేరుతో రూపుదిద్దుకుంటున్న కార్యక్రమానికి సంబం ధించి అన్ని యాజమాన్య పాఠశాలలు నిషేధించాలని డీఈవో ఎస్.షంషుద్దీన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో పై కార్యక్రమానికి సంబంధించిన ఎటువంటి బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటుచేయకూడదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ లేదా ఇతర యాజమాన్య పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించరాదని హెచ్చరించారు. వీటిని ప్రోత్సహిస్తే సంబంధిత సంస్థలు లేదా వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో స్పష్టం చేశారు.

నేడు కడపకు రానున్న శ్రీచరణి

- నగర వీధులలో భారీ ర్యాలీ


శ్రీచరణి

కడప స్పోర్ట్స్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఇండియా జట్టు మహిళల వన్డే వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా ముద్దుబిడ్డ ఎన్.శ్రీచరణి శుక్రవారం సాయంత్రం కడపకు రానున్నారు. వరల్డ్ కప్ పోటీలలో శ్రీచరణి బౌలర్‌గా సత్తాచాటిన సంగతి యావత్ భారత క్రీడాభిమానులం దరికీ తెలిసిందే. శ్రీచరణి శుక్రవారం సాయంత్రం 4-30 గంటలకు కడప చేరుకోనున్నారు. అనంతరం కడప హెడ్ పోస్టాఫీసు నుంచి , 7రోడ్లు, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ వరకూ భారీ ర్యాలీ చేస్తారు. సాయంత్రం 6-30 గంటలకు వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఆమెను సత్కరిస్తామని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు.

ఇదీ శ్రీచరణి ప్రస్థానం

వీఎన్‌పల్లె మండలం యర్రబల్లెకు చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రేణుక దంపతుల చిన్న కుమార్తె శ్రీచరణి. చంద్రశేఖర్‌రెడ్డి 1992 నుంచి యర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇక్కడే పుట్టిన శ్రీచరణి 10వ తరగతి వరకు డీఏవీ స్కూల్‌లో చదివింది. చిన్నప్పుడు కోకో, కబడ్డీ తర్వాత అథ్లెటిక్స్‌లో మంచి ప్రావీణ్యం చూపించింది. 9వ తరగతి నుంచి క్రికెట్ అంటే ప్రేమ పెంచుకుంది. తండ్రి క్రికెట్ వద్దని వారించారు. అయితే శ్రీచరణి అమ్మ, మేనమామ నచ్చచెప్పి ఆయనను ఒప్పించా రు. మొదట కోచ్ సురేశ్ వద్ద శిక్షణ పొందిం ది. తరువాత మంగళగిరిలో శ్రీనివాసరెడ్డి కోచింగ్‌తో మరింత రాటుతేలింది. అండర్ 19లో, తరువాత ఉమెన్స్ టీ20లోను, శ్రీలంక మ్యాచ్‌లకు ఎంపికైంది. రెండు సంవత్సరా ల్లోనే ఉమెన్స్ ప్రీమియర్‌లీగ్ (డబ్ల్యుపీఎల్) ఆడి రాణించింది. అనంతరం ప్రపంచకప్ ప్రాబబుల్స్‌లో శ్రీచరణికి చోటు దక్కింది. ఇక మహిళల వన్డే వరల్డ్ కప్‌లో జరిగిన 9 మ్యాచ్‌లలో 14 వికెట్లు సాధించింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా మ్యాచ్‌లో రెండు కీలక వికెట్లు తీసింది. ప్రపంచకప్ సాధించిన జట్టులో శ్రీచరణి కీలక భూమిక పోషించడంతో జిల్లా ప్రజలు ఉప్పొంగిపోయారు. నేడు ఆమె రాకకోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

వైసీపీ డ్రామా..!

- ఎగ్జిబిషన్ లీజు బకాయిల పేరుతో రాచమల్లు దీక్షలు
- మున్సిపల్ ఎన్నికలు సమీపించడమే కారణం

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో మున్సిపల్ ఎగ్జిబిషన్ లీజు బకాయిల పేరుతో వైసీపీ రాజకీయం మొదలెట్టింది. గత పదేళ్లకు పైగా మున్సిపల్ ఎగ్జిబిషన్ లీజు బకాయిలు పేరుకుపోయినా.. మున్సిపల్ అద్దెగదులకు బకాయిలు ఎగవేసినా పట్టించుకోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇప్పుడు మాత్రం రోడ్డెక్కి నిరసనలకు దిగారు. కొద్ది నెలల్లో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయన ఎగ్జిబిషన్ లీజు బకాయిల పేరుతో రచ్చ చేస్తున్నారని చర్చ నడుస్తోంది. మున్సిపల్ పీఠం మళ్లీ దక్కించుకోవడమే లక్ష్యంగా రాచమల్లు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ పాలనతో పాటు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడిపై ఆరోపణలు ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు వైసీపీ బ్రేకులు

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పాలకవర్గం వైసీపీ చేతిలో ఉంది. దీంతో టీడీపీ చేయాలనుకున్న అభివృద్ధి పనులను వైసీపీ వ్యూహాత్మకంగా అడ్డుకుంటూ వస్తోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి 21 మంది మెజారిటీ కౌన్సిల్ సభ్యులు వచ్చారు. అయితే వారిలో కొందరికి నేరాలతో సంబంధం ఉండటం వలన వరదరాజులరెడ్డి మద్దతు తెలుపలేదు. దీంతో వారు టీడీపీలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే మళ్లీ వైసీపీలోకి వెళ్లారు. వాస్తవానికి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి కార్యకలాపాలపై వైసీపీ దృష్టి పెట్టలేదు. ఇదంతా టీడీపీ వైఫల్యంగా వరదరాజులరెడ్డికి అంటగట్టేందుకు రాచమల్లు, ఆయన బావమరిది బంగారురెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఏ అభివృద్ధి పనిచేసినా అది ఎక్కడ టీడీపీ ఖాతాలోకి వెళుతుందో అనే అనుమానంతో.. వైసీపీ ఆధ్వర్యంలోని మున్సిపల్ పాలకవర్గం ఏడాదిన్నర కాలంగా ఒక్క రూపాయి పనికూడా జరగనివ్వకుండా అడ్డుకుంటూ వస్తోంది.

వ్యూహాత్మకంగా రాచమల్లు అడుగులు

దీనికి తోడు గత వైసీపీ హయాంలో జరిగిన పనులపై విజిలెన్సు విచారణ జరుగుతుండటంతో వైసీపీ తన వ్యూహాన్ని మార్చింది. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మున్సిపాలిటీలో తన సత్తాచాటి చైర్మన్ పీఠం దక్కించుకోవాలనే ఎత్తుగడతో ముందస్తుగా పావులు కదుపుతోంది. ఇంక రాచమల్లు నిద్రపోకుండా రోజూ మున్సిపాలిటీపై దండెత్తి ప్రజల దృష్టికి ఆకర్షించడానికి రోజుకో వ్యూహం పన్నుతాడని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇందులో భాగంగానే ఆయన ఎగ్జిబిషన్ లీజు వేలం బకాయిల పేరుతో రిలే దీక్షలకు దిగారు అంటున్నారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్ దక్కించుకున్న శివప్రసాద్ ఇప్పటివరకు రూ.1.46 కోట్లు చెల్లించాడు. ఇంకా జీఎస్టీతో కలిపి రూ.79.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈనెల 9వ తేదీవరకు ఎగ్జిబిషన్‌కు అనుమతులు ఉన్నాయి. అయినా సరే.. బకాయిలు చెల్లించాలంటూ రాచమల్లు కోర్టులో కేసులు వేయడం.. రిలేదీక్షలకు దిగడం వెనక రాజకీయ కోణం మాత్రమే ఉందని, ప్రజాసంక్షేమం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

చైర్‌పర్సన్‌డమ్మీ

2021 మార్చి నెల నుంచి అధికారంలో ఉన్న వైసీపీ పాలక మండలి చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి ఏ రోజూ పట్టణంలో స్వతంత్రంగా తిరిగి ప్రజల సమస్యలను పట్టించుకుంది లేదు. ఆమెను కుర్చీకి పరిమితం చేసి పరిపాలన అంతా రాచమల్లు బావమరిది బంగారురెడ్డి కనుసన్నుల్లో నడిపిస్తున్నారు. ఇప్పటికి టీడీపీ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం అయినా చైర్‌పర్సన్ స్వతంత్రంగా తనను ఎన్నుకున్న వార్డులో కూడా పర్యటించలేని దౌర్భాగ్యం ఆమెది. అంటే వైసీపీ రాజకీయంగా బీసీ మహిళకు పదవి ఇచ్చినట్టే ఇచ్చి మున్సిపాలిటీలో ఎలాంటి రాజకీయం చేస్తున్నదో ప్రొద్దుటూరు ప్రజలందరికీ నాలుగేళ్లలో బాగా బోధపడింది. ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎవరో కూడా ప్రొద్దుటూరు ప్రజలు గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ ఇక్కడ గెలిచేందుకు రాచమల్లు, ఆయన బావమరిది రాజకీయ విమర్శలకు పదును పెడుతున్నారు. మరి వీరిని ఎదుర్కొనేందుకు టీడీపీ ఏ విధంగా అడుగులు వేస్తుందో వేచి చూడాల్సి ఉంది.



ఎగ్జిబిషన్ బకాయిలు వసూలు చేయాలంటూ దీక్షకు దిగిన రాచమల్లు

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడులు

- నాలుగు క్రేన్లు స్వాధీనం
- అడ్డుకున్న నాయకులు


వేముల మండలంలో ఉన్న అక్రమ మైనింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఎంజీ అధికారులు

కడప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలో బెరైటీస్ అక్రమ తవ్వకాలపై ఏడీఎంజీ అధికారులు దాడులు చేశారు. గురువారం డీడీ సుబ్రమణ్యం, ఏడీ కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఈ దాడులు సాగించారు. వేముల మండలంలో అక్రమంగా వెలికితీస్తున్న ముగ్గురాయి గనులపై వీరు దాడులుచేసి నాలుగు క్రేన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో పెకిలించి అక్కడి నుంచి తరలించేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే స్థానిక నేతలు, అక్రమ మైనింగ్‌దారులు క్రేన్‌లను తరలించకుండా అడ్డుకున్నారు. అధికారులు ట్రాక్టర్లను బాడుగకు పిలవగా వారిని రానివ్వకుండా బెదిరింపులకు దిగారు. అలాగే క్రేన్ల వద్దకు వెళ్లే దారిలో కూడా అడ్డగించారు. దీనితో ఏడీ ఎంజీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నా, ఇష్టమొచ్చినట్లు ముగ్గు రాయి అమ్ముకుంటున్నా మేము చూస్తూ ఉండాలా అని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం వేంపల్లె మండలంలో కూడా ఏడీఎంజీ అధికారులు అక్రమ తవ్వకాలపై దాడులు చేశారు. అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి నట్లు ఆలస్యంగా వెలుగుచూ సింది. ఈ కార్యక్రమంలో ఏడీఎంజీ ఆర్‌ఐలు, వేము ల తహశీల్దార్ రెడ్డిలక్ష్మి, ఆర్‌ఐ పాల్గొన్నారు.

పీలేరుకు డయాలసిస్ సెంటర్..

● ఫలించిన వైద్యుడి కృషి ● ప్రారంభానికి సన్నాహాలు ముమ్మరం ● దాదాపు 200 మందికి ప్రయోజనం

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం వరకు కంటి శస్త్ర చికిత్సలకు లయన్స్ క్లబ్ పెట్టింది పేరు. ఎంతో క్లిష్టమైన కంటి జబ్బులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగానే చికిత్స అందేది. కాలానుకుణంగా చిన్న, మధ్య తరహా ఊళ్లలో కూడా కంటి వైద్యం అందరికీ అందుబాటులోకి రావడంతో లయన్స్ క్లబ్‌పై ఒత్తిడి తగ్గింది. దీంతో సేవలు మరింత విస్తృతం చేయాలని పీలేరుకు చెందిన ప్రముఖ వైద్యుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్ సంకల్పించారు. అందులో భాగంగా పీలేరులో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఆలోచనతో సరిపెట్టుకోకుండా క్లబ్ సహచరులను వెంట బెట్టుకుని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసి, పీలేరుకు డయాలసిస్ కేంద్రం అవసరం ఉందన్న బీజాన్ని వారిలో నాటారు. డాక్టర్ ప్రసాద్ ఆలోచన, పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయభాస్కరరెడ్డి ప్రయత్నం, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ ఫలించి పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరైంది. ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్‌డీపీ) ద్వారా పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అక్టోబరు 21న ప్రకటించారు. దీంతో పీలేరు ప్రాంతంలోని 200 మంది డయాలసిస్ రోగులకు ప్రయోజనం కలుగనుంది. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న మంత్రి ప్రకటనకు అనుగుణంగా పీలేరులో కేంద్రం నిర్వహించేందుకు అపోలో ఆసుపత్రుల యాజమాన్యం ముందుకు వచ్చింది. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది.

విస్తృత వైద్య సేవల కోసమే..



లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతమైన వైద్య సేవలు సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పూనుకున్నాం. మా ప్రయత్నం ఫలించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావడంతో ఎంతో సంతోషంగా ఉంది.

- డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్

ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు ..



మా ప్రయత్నాలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అసెంబ్లీలో ఆయన మాట్లాడిన తర్వాతనే సెంటర్ ఏర్పాటు ప్రక్రియలో వేగం వచ్చింది. ప్రసాద్ ఆలోచనతో ఎంతో మందికి మేలు జరగనుండడంతో ఎంతో ఆనందంగా ఉంది.

- చింతల విజయభాస్కరరెడ్డి, పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

పీలేరు పరిసరాల్లో 200 మంది రోగులు

శరీరంలోని వ్యర్థాలను కిడ్నీలు వడపోత చేస్తాయి. ఒకరోజులో దాదాపు 180 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయని అంచనా. అధిక రక్తపోటు, దీర్ఘకాలిక మధుమేహం, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, మితిమీరిన మందుల వినియోగం వంటి కారణాలతో కిడ్నీలు పాడవుతుంటాయి. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న వారి రక్తాన్ని ప్రత్యేక యంత్రం ద్వారా శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను డయాలసిస్ అంటారు. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు సార్లు లేదా నాలుగు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాలికంగా కిడ్నీ జబ్బులున్న వారికి జీవితాంతం డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలతోపాటు చిత్తూరు జిల్లా సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన 200 మంది తిరుపతిలోని స్విమ్స్‌తోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి వారం డయాలసిస్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ ఉచితంగా లభిస్తున్నప్పటికీ పీలేరు నుంచి తిరుపతికి వెళ్లేందుకు రోగులు ఆపసోపాలు పడుతుంటారు. డయాలసిస్ కేంద్రాలు 24గంటల ప్రాతిపదికన నడుస్తుండడంతో నిర్వాహకులు ఎప్పుడు చెబితే అప్పుడు అక్కడకు వెళ్లాల్సి ఉంటుంది. కొంత మందికి పగలు స్లాట్ దొరికితే, కొంత మందికి రాత్రి పూట దొరుకుతూ ఉంటుంది. ఆ సమయంలో వాహనాలు సమకూర్చుకుని, వెంట సహాయకులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో డయాలసిస్ సేవలు ఉచితంగా అందుతున్నా ఒక్కో సిట్టింగ్ కోసం బాధితులు రూ.2500ల నుంచి రూ.4 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఆ ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయని పలువురు బాధితులు తెలిపారు.



తిరుపతి స్విమ్స్‌లోని డయాలసిస్ వార్డు (ఫైల్ ఫొటో)

లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రి నిర్వహించేందుకు పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో రూ.1.50 కోట్ల వ్యయంతో అధునాతన భవనం నిర్మించారు. ఆ భవన నిర్మాణానికి డా.ప్రసాద్ దాదాపు రూ.40 లక్షల స్వంత నిధులు వెచ్చించారు. ఆ భవనంలోనే కొన్ని మార్పులు చేసి డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ భవనంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అటు ప్రభుత్వం, ఇటు అపోలో సంస్థ అంగీకరించింది.

ఒకటిన్నర నెల క్రితం ఆ సంస్థ ప్రతినిధులు భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం 32 కిలోవాట్ల జనరేటర్, ఒక నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయమని అపోలో సంస్థ కోరగా, దాదాపు రూ.10లక్షలు వ్యయమయ్యే ఆ వసతులు కల్పించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు అంగీకరించారు. దీంతో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి మార్గం సుగమమైంది. సుమారు ఒక నెల రోజుల్లో అక్కడ డయాలసిస్ సేవలు ప్రారంభం అవుతాయని లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయ భాస్కర రెడ్డి తెలిపారు. తొలుత మూడు బెడ్ల సౌకర్యంతో ప్రారంభమయ్యే సేవలు, 15 బెడ్‌ల వరకు పెరుగుతాయని, ఆ కేంద్రాన్ని అపోలో సంస్థ ఐదేళ్ల వరకు నిర్వహిస్తుందని ఆయన వివరించారు.



డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్న భవనం

ఖర్చులు తగ్గిపోతాయి..



ఒక సిట్టింగ్‌కు తిరుపతికి పోయి రావడానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల దాకా ఖర్చు అవుతుంది. సెంటర్ నిర్వాహకులు ఎప్పుడు సమయం ఇస్తే అప్పుడు వెళ్లాలి కాబట్టి రాత్రి పూట వెళ్లాలంటూ ఇబ్బందిగా ఉంటుంది. అందుకని కారు తీసుకెళ్లాలి. పీలేరులో డయాలసిస్ సెంటర్ వస్తే ఆ ఖర్చు కూడా తగ్గిపోతుంది. మిగిలే ఆ నాలుగు డబ్బులు కుటుంబం కోసం ఖర్చు చేసుకోవచ్చు.

- సాయి సత్యం, డయాలసిస్ రోగి, పీలేరు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

● పోస్టర్లు ఆవిష్కరించిన సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో పది ప్రైవేటు సంస్థలతో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి 9553202509, 6301612761 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

● డీఎల్‌డీవో లక్ష్మీకాంతం

రామాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో లక్ష్మీకాంతం గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దిబ్బలు, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వీధుల్లో చిన్న చిన్న గుంతలు ఉన్నచోట నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటివి రాకుండా చూడాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లోని చెత్తను సంపద కేంద్రాలకు తెచ్చి పొడి, తడి చెత్తలుగా వేరు చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చెంబకూరు విద్యార్థి



తరుణ్‌కుమార్ రాజు

రామసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఎంపికల్లో చెంబకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి జె.తరుణ్‌కుమార్‌రాజు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి ఎస్వీ క్రీడామైదానంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్-17కు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. పీడీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తరుణ్‌కుమార్‌రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తరుణ్‌ను పాఠశాల హెచ్ఎం రమేశ్‌బాబు, పీడీ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులను విస్మరిస్తే ప్రభుత్వానికి మనుగడ ఉండదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, ప్రధాన కార్యదర్శి నాసర్ అన్నారు. గురువారం స్థానిక జీఆర్‌టీ హైస్కూల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సుయాత్ర సభలో వారు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర సాగుతోందని, ఇందులో భాగంగా 16వ రోజు మదనపల్లెకు చేరుకుందన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చిన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ ఏడాదిన్నర దాటినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అమలు చేస్తామనడం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమేనన్నారు. ఈనెల 12వ తేదీన అనంతపురంలో ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ నాగభూషణం, భవిత, ప్రవీణ్‌కుమార్, అభినయ్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్యారంపల్లెలో నగలు చోరీ

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్యారంపల్లెలో బుధవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన దాదిని లోకనాథ్ బుధవారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వ్యవసాయ భూముల వద్దకు వెళ్లిన సమయాన గుర్తుతెలియని దుండగులు ఇంటి ఆవరణలో దాచిన తాళాలను తీసుకుని చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికి వచ్చి గమనించిన లోకనాథ్ కుమార్తె మౌనిక తల్లిదండ్రులకు విషయం తెలిపింది. ఇంటి బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.2లక్షల 60వేలు విలువ చేసే బంగారు నగలను దుండగులు అపహరించుకుపోయారు. దాదిని లోకనాథ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



తుఫానుతో నష్టపోయిన పంటలు పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం సహా అన్నమయ్య జిల్లాలో మొంథా తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ తెలిపారు. గురువారం తాటిగుంటపల్లె, మూరేవాండ్లపల్లె, టేకలకోన గ్రామాల్లో టమోటా, బొప్పాయి పంటలను పరిశీలించారు. తుఫాను సృష్టించిన బీభత్సంతో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను, తుఫాను బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ దేవర, జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

11 మంది జూదరులకు జైలుశిక్ష

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ 2021లో పోలీసులకు పట్టుబడిన 11 మంది జూదరులకు తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల పరిధిలో పలువురు పేకాట ఆడుతూ 2021లో 11 మంది పట్టుబడ్డారు. దీంతో ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటి ఎస్ఐ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పూర్వాపరాలను విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో 11 మందికి 7 రోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు. జరిమానా కట్టని పక్షంలో మరో 30 రోజులు అదనంగా సాధారణ జైలు శిక్ష విధించినట్లు జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారుల బృందం

పీలేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకుల బృందం పరిశీలించింది. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెయిన్, బాలికల పాఠశాల, కోటపల్లె జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లను తనిఖీ చేశారు. విద్యార్థుల అవసరాల మేరకు సరిపడా ఫర్నీచర్, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెంటిలేషన్ మొదలగు వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల ప్రిపరేషన్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, బోధన తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చక్కటి ప్రణాళికతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిశీలన బృందంలో ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్, పరీక్షా విభాగం సిబ్బంది నాగరాజు, హెచ్ఎంలు ప్రేమరాణి, రేణుకాదేవి, జయపాల్ రెడ్డి, బాబు, శివ శంకరయ్య, సీఆర్పీ జే. మురళీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 15, 16న తేదీల్లో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పివిరమణ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై రాజీ పడకుండా ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరాడుతోందన్నారు. రెగ్యులర్ చేస్తామని పాలకుల హామీల కోసం హక్కుల సాధన కోసం, పనికి సమాన వేతనం పొందడానికి మళ్లీ పోరాటాలకు నాంది పలికామన్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె బి.కొత్తకోట మున్సిపల్ వర్కర్స్ హాజరై రాష్ట్ర మాహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ రాజు, జిల్లా నాయకులు గంగయ్య, గోపాల్, శ్రీరాములు. శ్రీనాథ, రామకృష్ణ, కృష్ణప్ప, వెంకటరమణ, పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వేలం ద్వారా రెడ్డివారిపల్లి పంచాయతీకి రూ.64 వేల ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీవో నాగరాజ, ఎంపీడీవో రమేశ్ తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపల చెరువులను వేలం వేశారు. పంచాయతీలో మొత్తం ఐదు చెరువులను వేలం వేస్తే సీతమ్మచెరువు రూ.25 వేలు, వీరప్పచెరువు రూ.22 వేలు, బొడికిందరాయుని చెరువు రూ.12 వేలు, దాసరివానికుంట రూ.3 వేలు, మొరపు కుంట రూ.2 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. మొత్తం పంచాయతీకి రూ.64 వేలు ఆదాయం వచ్చిందని దీనిని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు తెలిపారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ చెరువులు పాడుకొన్న లబ్ధిదారులు చెరువుల్లో కేవలం చేపలు మాత్రమే పట్టి అమ్ముకోవచ్చని ఇతరత్రా పనులకు ఉపయోగించరాదన్నారు. చెరువుకు ఇచ్చిన సమయం అయిపోగానే తిరిగి వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన

ఐదుగురికి జైలుశిక్ష

రాయచోటిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని నలుగురికి ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున జరిమానా విధించడంతో పాటు మరో ఐదుగురికి ఒక్కొక్కరికి మూడు రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసులు సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెలలో పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడిన వారికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సీఐ తెలియజేశారు. సమాజ శ్రేయస్సు దృష్ట్యా రోడ్డు భద్రత అవగాహనలో భాగంగా పోలీసులు ఎన్నిసార్లు సూచనలు చేసినా పెడచెవిన పెట్టి రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తూ నాకేం కాదులే అనే ఉద్దేశ్యంతో వాహనాలు నడిపే వారికి ఇదొక గుణపాఠం అన్నారు. భవిష్యత్తులో కూడా మీ శ్రేయస్సు మీ కుటుంబ శ్రేయస్సు, సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మరింత పటిష్టంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి భవిష్యత్తులో మరింత జైలుశిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లచెరువు పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డిల సమక్షంలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ముందు నుంచి పార్టీని నమ్ముకున్న వారికి, కొత్తగా చేరుతున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అందరూ సమన్వయంగా కలిసి మెలిసి పార్టీ అభివృద్ధికి పాటుపడడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్, నాగేశ్వర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మండిపల్లి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు, ప్రజలు

బంగారు భవిష్యత్తుకు వేదిక గ్రంథాలయాలు

● రూ.2 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు ● పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి సాయం



ఎస్ఐకి సీసీ కెమెరాలను అందిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు గ్రంథాలయాలు చక్కని వేదికని దగ్గుబాటి వెంకటేశ్వరరావు, డీవైఈవో లోకేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బాటవారిపల్లె హైస్కూల్ గ్రంథాలయానికి లయన్స్ క్లబ్ తరపున లయన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రజనీకుమార్, బరకం శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఇతర దాతలు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారు. పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభ సమావేశంలో డీవైఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి వెంకటేశ్వరరావు సొంతంగా రూ.11 లక్షలు ఖర్చు చేసి సమాజ సేవకు అంకితమయ్యారని కొనియాడారు. విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ తరపున రూ.8 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న గొప్పవ్యక్తుల దాతృత్వం చిరకాలం నిలిచిపోతుందని వక్తలన్నారు. ఎంవీ రావ్స్ చిట్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల భద్రత, రక్షణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన సోలార్ సీసీ కెమెరాలను ఎస్ఐ రామాంజనేయులుకు అందజేశారు. అనంతరం దగ్గుబాటి మాట్లాడుతూ తన సాయశక్తులా కృషి చేసి రాబోయే రెండేళ్లలో మూడు మండలాల ప్రజలకు అనువుగా లయన్స్ ఆస్పత్రి, దాతల సహకారంతో ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుబాటిని హెచ్ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల పరిశీలకుడు శ్రీనివాస్‌రాజు, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈవో మునీంద్రనాయక్, హెచ్ఎంలు, లయన్‌లు హరినాథ్‌నాయుడు, ప్రసాద్, అబ్బూరి తిరుపతి నాయుడు, పునీత్‌చౌదరి, హరినాథ్ నాయుడు, వైవీ రమణ, ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయం ప్రారంభంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల వయస్సు నిండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్‌యాదవ్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి సీఈవో వీసీ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్ట్రోరల్ రోల్స్ (ఎస్.ఐ.ఆర్-2025)పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న ఎస్ఐఆర్-2025 కార్యక్రమంపై పలు సూచనలు, మార్గదర్శకాలు వర్చువల్ విధానంలో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో నమోదు చేపట్టాలన్నారు. అనర్హులను తొలగించడం, జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సీఈవో సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కిచెన్లతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య (ఎంఎస్) ఆధ్వర్యంలో స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా సమాఖ్య కార్యాలయంలో గురువారం అధ్యక్షురాలు హసేనమ్మ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ స్మార్ట్‌కిచెన్లు ఏర్పాటుతో నెలకు రూ.20వేల నుంచి 30వేల వరకు మండల సమాఖ్యలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈప్రాజెక్టును రాష్ట్రస్థాయిలో మొట్టమొదటిసారిగా జిల్లాలో కలెక్టరు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, రుచికరమైన భోజనాన్ని వడ్డించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఇప్పటికే సీకేదిన్నె మండలంలో స్మార్ట్‌కిచెన్‌ను మండల సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐబీడీ పీఎం లావణ్య, వివిధ విభాగాల యాంకర్ పర్సన్స్, జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంలో అడ్వెంచర్ క్యాంప్‌లు ఎంతో దోహదపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సయ్యద్ అలీ, మహమ్మద్‌లు నవంబరు 10 నుంచి 21వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగబోయే రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికయ్యారు. వీరిని గురువారం కళాశాల ప్రాంగణంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ సైనిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో అడ్వెంచర్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషి స్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్‌తో పాటు క్యాడెట్లు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో దొరికిన వాళ్లంతా వైసీపీ వాళ్లే

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి



మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ కేసులో ఉన్న వాళ్లంతా వైసీపీ కార్య కర్తలే అని, క్యాసినోలో టీడీపీ ముసుగు వేసు కున్న వాళ్లంటే ఉపేక్షిం చవద్దని ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి స్వయంగా ఎస్పీకి లెటర్ ఇచ్చాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యా లయంలో ఆయన ముక్తియార్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ నేను హింసా రాజకీయాలను ప్రోత్సహించనని తనకు తానుగా రాచమల్లు కితాబు ఇచ్చుకుంటే.. నందం సుబ్బయ్య హత్య తరువాత ప్రొద్దుటూరు ప్రజలు ఎవ్వరూ నమ్మరన్నారు. ఎగ్జిబిషన్ బకాయిలు చెల్లించలేదని కోర్టులో కేసులు వేశారు. మళ్లీ టెంట్లు వేసి రిలేదీక్షలు పేరుతో చేస్తున్న రాజకీయం ఏమిటని ప్రశ్నించారు. ఎగ్జిబిషన్ బకాయిలు, ఇతర సమస్యల మీద కాకుండా అక్కడ కూర్చొని ప్రొద్దుటూరులో జరిగే అసాంఘిక కార్యకలాపాలన్నీ టీడీపీ అండతో సాగుతున్నాయని చెప్పడం చూస్తేనే రాచమల్లు చేస్తున్న రాజకీయాలు ఏమిటో తేట తెల్లమౌతుందన్నారు. జూదం, బెట్టింగ్‌లు, సారా, మాంసం వ్యాపారాల్లో వరదరాజులరెడ్డి కుటుంబం ఎప్పుడు లేదన్నారు. రాచమల్లు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అతన్ని ప్రొద్దుటూరు ప్రజలు నమ్మలేరన్నారు. సమావేశంలో మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్‌ముక్తియార్, మాజీ కౌన్సిలర్లు వద్దిబాలుడు, తలారి పుల్లయ్య, కౌన్సిలర్ జిలాన్, ఖలీల్‌లు తదితరులు పాల్గొన్నారు.

పౌరులకు సుపరిపాలనే కూటమి పాలన లక్ష్యం

- డేటా ఆధారిత పాలన సదస్సులో సీఎం



సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని పౌరులకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం డేటా ఆధారిత పాలనపై ముఖ్యమంత్రి అధ్యక్షతన రాజధానిలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, డీఎఫ్ఓ వినీత్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకొని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేయడం వల్ల మొంథా తుపాన్ నుంచి ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించామన్నారు. డేటా ఆదారిత పాలన అనేది ఇపుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించడం జరుగు తుందన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా వనరులను సమర్థవం తంగా వినియోగించుకోగలుగుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేయడం జరుగుతుందన్నారు.

చోరీ, చైన్‌స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు అరెస్టు

- 21 తులాల బంగారు నగలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో ఇటీవల బంగారు దుకాణాల్లో జరిగిన చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను ఒన్‌టౌన్, త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఆమేరకు గురువారం డీఎస్పీ భావన ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో నిందితుల అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణం పరిధిలోని మహబూబ్ షరీఫ్, పోలంకి మహేష్‌లకు చెందిన బంగారు అభరణాల దుకాణాలలో బంగారు నగలు చోరీ చేసిన దొంగను ఒన్ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ రెండు దొంగతనాలు రాగా హరీష్ అనే దొంగ చేశాడన్నారు. ఇతనిది అనంతరపురం జిల్లా చెన్నెకొత్తపల్లె నామాల గ్రామం అని, ప్రస్తుతం కడప చిన్నచౌక్‌లో ఉంటున్నట్లు తెలిపారు. ఈరెండు చోరీలు చేసిన నిందితున్ని సీసీ కెమెరాల్లోని పుటేజీల ఆధారంగా గుర్తించామన్నారు. ఈ కేసులో మొత్తం 18.1 తులం బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే బుధవారం రాత్రి త్రీటౌన్ పరి ధిలోని భగత్‌సింగ్ కాలనీలో ఇంటి ముందు అరుగుపై ఒంటరిగా కూర్చొని ఉన్న వృద్ధురాలు జానపాటి లక్ష్మీదేవి (72) మెడలో గొలుగును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారైన కేసులో షేక్ మౌలాలి (31) అనే నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతను ప్రొద్దుటూరు హోమస్‌పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతని వద్ద నుంచి 30గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. వీరందిరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఒన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, త్రీటౌన్ సీఐ వేణు గోపాల్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు విజయం



బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బండలాగు పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి సాధించాయి. ధరణి తిమ్మాయపల్లె అవధూత కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం వృషభరాజములచే రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొండయ్యస్వామి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. తెలంగాణ హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, గాండీవ, వీర నరసింహారెడ్డిలకు చెందిన ఎస్ఎస్ఆర్ ఎడ్లు 2వేల 455 అడుగులు బండలాగి మొదటి స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి గెలుచుకోగా, కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి, తోట తిరుపాల్‌రెడ్డి, దుబ్బన్న, చెన్నకేశ వరెడ్డిలకు చెందిన ఎడ్లు 2 వేల 418 అడుగులు బండలను లాగి రెండో బహుమతి కింద రూ.2లక్షల నగదు అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతులను కొండయ్యస్వామి స్వయంగా విజేతలకు అందచేశారు.

గుప్తనిధుల వేటగాళ్లు పట్టివేత



గుప్తనిధుల వేటగాళ్ల కోసం గాలిస్తున్న గ్రామస్థులు, పట్టుబడిన వేటగాళ్లు దిలీప్‌రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలో గుప్త నిధుల వేటకు వచ్చిన ముగ్గురిని గ్రామస్థులు పట్టుకున్నారు. ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురనాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్ చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్థుల రాకను పసిగట్టిన ముఠా పారి పోయేందుకు ప్రయత్నించిది. వీరిలో శశికుమార్, శ్రీధర్‌ను ఆలయ సమీపంలో పట్టుకున్నారు. దిలీప్‌రెడ్డి అనే వ్యక్తి పారిపోగా వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడిన వారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చా మని ఒప్పుకున్నారు. పారిపోయిన వారిలో ఒక మహిళ, మరో వ్యక్తి ఉన్నారు. వారికోసం గ్రామస్థులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బోరు నారాయణరెడ్డి (78) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నారాయణరెడ్డి స్కూటర్‌పై తమ గ్రామానికి వస్తూ.. దత్తాపురం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా కడప నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణరెడ్డికి భార్యతో పాటు, పెళ్లైన కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి సుందరయ్య కాలనీలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తి అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన లక్కినేని దేవరాజ్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. తీరా పెళ్లికి నిరాకరించడంతో ఆ యువతి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

భార్యపై రోకలిబండతో దాడి

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తికా యలపల్లెలో గురువారం వీరమ్మ అనె మహిళపై ఆమె భర్త శివరంగారెడ్డి రోకలిబండతో దాడి చేయడంతో తీవ్ర గాయా లయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా భార్య, భర్తలు దూరంగా ఉన్నారని, భూమి విషయమై మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగిందని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు మైదుకూరు విద్యార్థి ఎంపిక

మైదుకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రెజ్లింగ్ అండర్-14 విభాగంలో మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పాశం వెంకటనవీన్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రామ్‌నాయక్, ఫాతిమా తెలిపారు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి, ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంఈఓ పద్మలత, పాఠశాల హెడ్మాస్టర్ ఇలియాస్ అహమ్మద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన నవీన్

వెల్లాల దేవస్థానానికి రూ.7.26 లక్షలు ఆదాయం



వెల్లాల దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి, భీమలింగేశ్వరస్వామి దేవస్థానాలకు రూ.7,25,866 ఆదాయం వచ్చినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈవో రమణ తెలిపారు. గురువారం ఆలయంలోని జ్ఞానమందిరంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 17.5.2025 నుంచి 6.11.2025 వరకు భక్తులు హుండీలలో సమర్పించిన డబ్బులను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే ఆంజనేయస్వామికి భక్తులు సమర్పించిన 1400 కిలోల పెసరబేడలను కిలో రూ.29 చొప్పున వేలం ద్వారా విక్రయించడంతో 40,600 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ వేలంపాటలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ గంగిరెడ్డి నారాయణరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పురుషుల, మహిళా జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ టి.నారాయణరావు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు, క్రీడాకారిణులు విజయనగరం జిల్లా కొండ వెలగడ గ్రామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న ఏపీ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికలకు హాజరయ్యే వెయి ట్ లిఫ్టర్లు ఐడబ్ల్యుఎల్ఎఫ్ కార్డు కలిగి వుండాలన్నారు. క్రీడాకారులు తమ వివరాల కు సంబంధించి వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా బీసీ సంక్షేమ, సాధికార అధికారి ఎం.అంజల ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు ఈ స్కీంకు అర్హులన్నారు. ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 9, 10తర గతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 75 వేల రూపాయలు, ఇంటర్‌కు లక్షా 25వేల రూపాయల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని వివరించారు.

నేడు విద్యార్థులకు నైపుణ్య పోటీలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు వృత్తి విద్యలో చేరిన విద్యార్థులకు జిల్లాస్థాయి నైపుణ్య పోటీలను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలస్థాయి పోటీల ద్వారా ఎంపికైన 206 ప్రాజెక్టులు శుక్రవారం కడప మాసాపేటలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రక్తదానం చాలా గొప్పది



శ్రీచైతన్య స్కూలులో రక్తదానం చేస్తున్న అధ్యాపకులను అభినందిస్తున్న ఏజీఎం రమణయ్య

సీకేదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాలకన్నా రక్తదానం ఎంతో గొప్పదని కడప రిమ్స్ రక్తదాన శిబిరం డైరెక్టర్ రాజేంద్ర తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య హైస్కూలులో ఆ విద్యాసంస్థలచైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి 77వ జన్మదినం సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య రక్తదానం ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. చైతన్య విద్యాసంస్థలు విద్యపరంగానే కాకుండా సామాజిక సేవలో కూడా తమ వంతు పాత్రను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ఆర్ఐ బాలభాస్కర్, అకడమిక్ కో-ఆర్డినేటర్లు రాజగోపాల్‌రెడ్డి, కుటుంబరావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ కార్యవర్గ సమావేశం

చక్రాయపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చక్రాయపేటలోని వేంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో బీజేపీ మండల కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల బీజేపీ పరిశీకురాలు సుష్మ హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత విషయాలపై చర్చ, పార్టీ శాఖ అభివృద్ధి కార్యవర్గ కమిటీ నిర్మాణం గురించి చర్చ జరిగింది. అనంతరం కాలేటివాగు ప్రాజెక్టు పనులను పూర్తి చేసి మండలంలో అన్ని చెరువులకు సాగునీరు అందించి కరువు రైతులకు సహాయం చేయాలన్నారు. పాపాఘ్ని నదిపై నిర్మాణంపై ఉన్న కె.రాజుపల్లె-కుప్పం హైలెవెల్ బ్రిడ్జి, అద్దాలమర్రి వద్ద ఉన్న హైలెవెల్ బ్రిడ్జిలను సత్వరంగా పూర్తిచేసి ఆర్‌వీ రోడ్డు నాగులగుట్టపల్లె, అగ్రహారం, మహదేవపల్లె రోడ్డు పూర్తిచేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి పలు అంశాలపై కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి, బొజ్జా రంగారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వేమారెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

డీపీఎం ప్రవీణ్‌కుమార్



ప్రకృతి వ్యవసాయంపై ఐసీఆర్పీలకు శిక్షణ ఇస్తున్న డీపీఎం ప్రవీణ్‌కుమార్

పులివెందుల రూరల్,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, దానిని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రకృతి వ్యవసాయ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక ఏపీకార్‌లలోని వ్యవసాయ కళాశాలలో 4వ రోజు ఐసీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రైతులను సమావేశపరిచి ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి, వాతావరణం, మానవాళి, పశుపక్ష్యాదులు ఆరోగ్యకరంగా మారుతాయన్న విషయాన్ని తెలియజెప్పాలన్నారు. అలాగే దిగుబడి, పంట నాణ్యతపై అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేశ్, ఉష, మనోజ్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాలి

చెన్నూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక రాయలసీమరాష్ట్రాన్ని 12 జిల్లాలతో ఏర్పాటు చేసి శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేసి తీరాలని రాయలసీమరాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచెం వెంకట సుబ్బారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ఏర్పడి 88 సంవత్సరాలు అయినా నేటికీ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఒప్పందాన్ని అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా 16న కర్నూలు టౌన్ అంబేడ్కర్‌భవన్‌లో జరిగే అఖిలపక్ష సమావేశానికి రాయలసీమ జిల్లాల్లోని ప్రజలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మండల అభివృద్ధికి నిధులు ఇవ్వండి



నారాలోకేశ్‌ను కలిసిన రామమునిరెడ్డి

వేంపల్లె, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిం చాలని విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో ఉన్న లోకేశ్‌ను కలిసి వేంపల్లె మండల సమస్యలను విన్నవించారు. రోడ్లు అధ్వానం గా ఉన్నాయని, నిధులు కేటాయించాలని కోరారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా పాపాఘ్ని నదికి నీటిని విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేంపల్లె ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేయాలని కోరారు. పార్టీకి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని లోకేశ్ చెప్పినట్లు రామమునిరెడ్డి తెలిపారు.

స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలుచేయాలి

వేంపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ కోసం స్వదేశీ విధానంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆత్మనిర్భర భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మోదీ పిలుపుతో స్వదేశీ విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, వృషభాచలేశ్వరస్వామి పాలక మండలిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గౌరీదేవికి ఊరేగింపు, నిమజ్జనం



వేంపల్లెలో గౌరీదేవి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):వేంపల్లె బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మహోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు గౌరీదేవి అమ్మవారికి పూజలు చేశారు. గురువారం ఉదయం పసుపుముద్దతో తయారు చేసిన గౌరీదేవి అమ్మవారి ప్రతిమను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి పాతపేట, మెయిన్‌బజార్ మీదుగా పాపాఘ్నినదికి వెళ్లి నీటిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బలలిజ సంఘంనేతలు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి, వలంటీర్లు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం నాగరాజుపేటలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష అభినందించారు.

'రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన ప్రభుత్వం'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్నిపూర్తిగా అప్పుల రాష్ట్రంగా మార్చిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం కడపనగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఇప్పుడు ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దుచేసే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు తెలియకుండా పట్టాభూముల్లో సర్వే ఎలా చేస్తారు'

కమలాపురం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు తెలియకుండా నోటీసులు ఇవ్వకుండా పట్టాభూముల్లో ఎలా సర్వే చేస్తారని వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కాశిభట్ల సత్యసాయినాథ్‌శర్మ అన్నారు. కమలాపురం మండలం చదిపిరాళ్లకు చెందిన సారమ్మ పేరుతో ఉన్న పట్టా భూమిని కమలాపురం తహసీల్దారు సర్వే చేయించిన విషయాన్ని తెలుసుకున్న సాయినాథశర్మ గురువారం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆయనను ప్రశ్నించారు. అనంతరం తహసీల్దారు శివరాంరెడ్డి మాట్లాడుతూ రైతులు ఇచ్చిన అర్జీ మేరకు సర్వే చేపట్టామని, అందులో మతలబు ఏమీ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్, నాగరాజు ఆచారి, వెంకటేశ్వర్‌రెడ్డి , రాజారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల కొండ ఆలయంపై ప్రాకారం

రాజగోపుర నిర్మాణానికి చర్యలు

వేంపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వరస్వామి ఎద్దుల కొండ ఆలయంపై ప్రాకారం, రాజగోపురం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పాలక మండలి సమావేశంలో తీర్మానించారు.నూతనంగా ఎన్నికైన ఆలయ చైర్మన్ పీవీ రమణ అధ్యక్షతన ఈఓ హనుమంతరావు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. కొండపైన వేంపల్లెలోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో నిత్య పూజలు, ప్రసాదాల పంపిణీ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూజలు చేయాలని నిర్ణయించారు. ప్రాకారోత్సవం,సత్యనారాయణ వ్రతం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని పలువురు సభ్యులు సూచించారు.

తుఫానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కమలాపురం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం తహసీల్దారుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. బీఎస్పీ నాయకులు బాలచంద్ర, రైతులు భాస్కర్, రాయప్ప రామాంజనేయులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో పరికరాల తరలింపును ఆపాలి

కడప ఎడ్యుకేషన్,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని పరికరాలను తరలించడం ఆపాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షల సహాయం

వేంపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన గంగాదేవి అనే బాధిత మహిళకు టీడీపీ నుంచి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ రూ.5లక్షల చెక్కును ఆమె బ్యాంకు ఖాతాలో జమచేయించారు. పార్టీ సభ్యత్వం ఉన్న భర్త ఆంజనేయులు ఇటీవల ప్రమాదంలో మరణించగా పార్టీ ఈ సహాయం అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, వీరభద్ర, మహమ్మద్, జబిఉల్లా, డక్కా రమేష్ తదితరులుపాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం మార్పు

సింహాద్రిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల బిల్లులు చెల్లింపు కేంద్రం మార్పు చేసినట్లు మండల విద్యుత్ ఏఈ దినేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సింహాద్రిపురం సబ్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనంలో బిల్లుఉ చెల్లించాలని ఏఈ తెలిపారు.

జిల్లాలో ప్రజలభద్రతకు విజిబుల్ పోలీసింగ్



వాహనాలను తనిఖీ చేస్తున్న కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

కడప క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులు లేనివారికి జరిమానా విధిస్తున్నారు. అంతేకాకుండా విజిబుల్ పోలీసింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మీడియా ఇన్‌చార్జి పగడాల బాలకృష్ణుడు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని కొలుములపల్లె, అంగడివీధి, నాగిరెడ్డిపల్లె, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువచేసే సాహిత్య పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైతిక విలువలు, విజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు.

డ్వాక్రామహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీయం గంగాధర్ అన్నారు. గురువారం కమలాపురం మండలసమాఖ్య కార్యాలయంలో ఎఫ్‌పీవో ద్వితీయ వార్షిక మహాసభను అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏవో సరస్వతి, పశువైద్యాధికారి మల్లికార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం నూతన బీవోడీ 15 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

వేముల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు భరోసాసేవా కేంద్రంలో ఎరువుల విక్రయదారులు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిరైతు సేవా కేంద్రాల సిబ్బందితో భూమాత సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎరువుల వినియోగంపై ఏవోజీపీ ఓబులేసు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు వాడకం ద్వారా మానవాళి మనుగడకేముప్పుఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలోవ్యవసాయ సిబ్బంది సురేష్, ఇంతియాజ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎరువుల విక్రయదారులురైతులు, ప్రజలుపాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

కడప క్రైం (ఆంధ్రజ్యోతి) నవంబరు 6 : పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి శ్రీ సిటీ లో సీఐ గా పని చేస్తున్న చిన్న పెద్దయ్యను కడప వన్ టౌన్ కు, ఇక్కడ పని చేస్తున్న సీఐ రామకృష్ణను కడప వీఆర్ కు బదిలీ చేశారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ సీఐ గా పని చేస్తున్న భాస్కర్ రెడ్డిని ఏహెచ్‌టీయూ కడపకు అలాగే స్పెషల్ బ్రాంచ్-2 సీఐ గా పని చేస్తున్న శివశంకర్ నాయక్ ను స్పెషల్ బ్రాంచ్ 1 కు, ఏహెచ్‌టీయూ కడప సీఐ గా పని చేస్తున్న ఈదురు బాషా స్పెషల్ బ్రాంచ్ 2 కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.

విజేతలకు బహుమతులు పంపిణీ



సింహాద్రిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలుగా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి బహుమతులు పంపిణీ చేశారు. బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహంచారు. ప్రతి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో 8 మందికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, వసంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

లింగాల,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థినిలకు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగాఅక్టోబరు నెల 11వ తేదీన మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో క్విజ్, వ్యాసరచన పోటీలను ఐసీడీఎస్ వారు నిర్వహించారు. ఈపోటీలలో విజేతలుగానిలిచిన విద్యార్థినిలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు రమణమ్మ, వెంకటలక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎ.ఓబాయపల్లె గ్రామంలో బురద తొలగింపు

వల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లె గ్రామంలోని ఇటీవల వర్షాల కారణంగా బురదనీటితో నిండిపోయి గ్రామ ప్రజలుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను స్థానికుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వల్లూరు డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా బురద నీరు నిలిచిన మట్టిని పూర్తిగా తొలగించారు. శానిటేషన్ కార్యక్రమం కూడా చేపట్టారు. వీధుల్లో చెత్త చెదారం తొలగించారు.

కంకర మిషన్‌కు అనుమతులు లేవు

- అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు
- మండల మీట్‌లో ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయలాపురం గ్రామ సమీపంలో ఉన్న ఓ కంకర మిషన్‌కు అనుమతులు లేకున్నా నడుస్తోందని మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఏఓ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా ఈ కంకర మిషన్ నడుస్తోందని, ఈ విషయంపై భూగర్భగనుల శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కంకరమిషన్ వల్ల చుట్టుపక్కల పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని డీటీ వెంకటరెడ్డిని ప్రశ్నించగా ఆయన భూగర్భగనుల శాఖ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించారు. సత్వరం చర్యలుతీసుకోకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా వెలుగుఏపీఎం గురురాజ్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్రప్రభుత్వం అనేక విధాలుగా మహిళలనుప్రోత్సహిస్తోందన్నారు. అలాగే విద్యార్థినులు, యువతులు, మహిళలు ఏదైన సమస్య ఎదుర్కొంటుంటే దానిని పరిష్కరించే దిశగా జండర్ రీసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ)ని వెలుగు కార్యాలయంలో పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తున్నామన్నారు.అనంతరం ఎంఈఓ-2 రామానాయుడు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బెడుదూరు గుట్ట వద్ద రిజర్వాయర్ నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట ప్రాజెక్టుకు పడమటి భాగాన ఉన్న గ్రామాల నీటి అవసరాల దృష్ట్యా బెడుదూరు గుట్ట వద్ద రిజర్వాయర్ నిర్మించాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం వారు తహసీల్దార్ గురప్పకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా 50 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు అందజేయాలని, తుఫానుతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, జయంతు, ఖాదర్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందండి



దువ్వూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

దువ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలను అందించి వారి మన్ననలు పొందాలని ఆశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ సూచించారు. దువ్వూరు సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆయన పరిశీలించి ఈ సందర్భంగా తగు సూచనలు ఇచ్చారు. అనంతరం అక్కడి అధికారులు, సిబ్బందితో ఆవరణలో సమావేశం అయ్యారు. వినియోగదారుల నుంచి 61 శాతం మాత్రమే ప్రజాధరణ ఇక్కడ నమోదు అయిందని, దీన్ని నూరు శాతానికి అధిగమించాలని చెప్పారు. వినియోగదారులతో మమేకం కావాలని తెలిపారు. సమావేశంలో స్థానిక ఏఈ రాజ్‌కుమార్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



మండల సమాఖ్య మహాసభలో మాట్లాడుతున్న ఏపీయం అనంతయ్య

కాశినాయన నవంబరు6(ఆంధ్రజ్యోతి) ప్రతి మహిళా లక్ష్యాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఏపీవో అనంతరయ్య పేర్కొన్నారు. గురువారం నర్సాపురం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య 17వ మహాసభలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్యలో సీఐఎఫ్ రుణాలు రూ..26 లక్షలు, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.19.5 కోట్లు, ఉన్నతి రుణాలు రూ. 35 లక్షలు 28 గ్రామ సంఘాల్లోని మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నూతన మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా ఎం.అంజలి, ఉపాధ్యక్షురాలుగా పుష్పలత, కార్యదర్శిగా మహబూబ్ చాద్, కోశాధికారిగా ఎం.రాజేశ్వరి నియమితులయ్యారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు సిద్ధయ్య,సునీల్ కుమార్, ప్రతాప్, సుదర్శన్, 28 గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

రాజుపాలెం మండల పరిధిలోని టంగుటూరు బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలకి అల్లుకున్న తీగలు ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించిన అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరు దిక్కంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కుమ్మరపల్లె గ్రామ పొలాల్లో ఒరిగిన స్తంభాలకు మొక్క లతీగలు అల్లుకుపోయాయి. అదే విధంగా వర్షాలకు పంట పొలాల్లో సైతం స్తంభాలు ఒరిగినట్లు ప్రతినిత్యం తిరుగుతున్నా విద్యుత్ అధికారులకు కనిపించకపోవడం దారుణం. విద్యుత్ అధికారులు వాటిపై దృష్టి ఎందుకు సారించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంత చిత్తడిప్రదేశాల్లో ప్రమాదకరంగా స్తంభాలు ఉంటే దారి వెంట పోయేవారి పరిస్థితి ఏంటని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలకు ఉన్న తీగులను తొలగించాలని కోరుతున్నారు.

అంత నిర్లక్ష్యమైతే ఎలా..? ఒకవైపు వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోవైపు తీగచెట్లు విద్యుత్ స్తంభాలకు ఎగబాకి ప్రమాదకరంగా మారినా ఎందుకు పట్టించుకోరంటూ ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక హడావిడి చేసేకంటే అవి జరగకముందే చర్యలు తీసుకోవడంలో అలసత్వం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-రాజుపాలెం, ఆంధ్రజ్యోతి



టంగుటూరు బీసీ కాలనీ స్తంభానికి అల్లుకుపోయిన తీగలు



ఎస్సీ కాలనీలో స్తంభానికి అల్లుకున్న తీగలు

మైదుకూరు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):మైదుకూరు పురపాలికను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని గురువారం జరిగిన మున్సిపల్ సమావేశంలొ ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న పుట్టా మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ మైదుకూరు మున్సిపాలిటీకి ఎక్కువ నిధులు తెప్పించి అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ప్రధమ స్థానంలో నిలుపుతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీటి సమస్య లేకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున ఎక్కడా నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైసీపీ కౌన్సిలర్లు అడిగిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. అందరూ మైదుకూరు అభివృద్దే లక్ష్యంగా ఉండాలని, పార్టీలతో సంబంధం లేకుండా కలిసికట్టుగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని కోరారు. సమావేశంలో ప్రతిపాదించిన పనులను రెండు మూడు నెలలలో పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులుగాని, సిబ్బందిగాని విధులను సక్రమంగా నిర్వర్తించకుండా అలసత్వం వహిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర మాట్లాడుతూ అజెండాలో వార్డుల వారిగా చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.

అభివృద్ధి పనులు నాసిరకంగా చేయవద్దు

మైదుకూరు పట్టణ అభివృద్ధి కోసం చేపట్టే నిర్మాణాలు నాసి రకంగా చేసి చెడ్డ పేరు తేవద్దు అని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు అనకుంటలో రూ.18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జేఎంజే కన్స్ట్రక్షన్ సంస్థ తలపెట్టిన నిర్మాణాన్ని పరిశీలించి ప్రాథమిక స్థాయిలోనే పని నాసిరకంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. రోలింగ్ చేసి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అదికారులు పనుల పర్యవేక్షణలో అలసత్వం వహించవద్దని నిర్మాణాలు పక్కాగా చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో కనీసవేతనాల సలహా మండలి డైరెక్టర్ దాసరి బాబు, తెలుగురైతు సంఘం ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఏపీ రవీంద్ర, ఎస్ఎఫ్‌సీఎస్ ఛైర్మన్ పాశం మారుతి, యాపరాల చిన్నా, ధనపాల రవి, మున్సిపల్ అదికారులు టీడీపీ నాయరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా, పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

పంట పొలాలకు కరెంట్ పెడితే చర్యలు

కాశినాయన నవంబరు6(ఆంధ్రజ్యోతి) పంట పొలాలను అడవి జంతువుల బారినుంచి కాపాడుకోవడానికి రైతులు పొలాల చుట్టు కరెంట్ పెట్టడం చట్టరీత్యా నేరమని అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాశినాయన మండల ఎస్ఐ యోగేంద్ర పేర్కొన్నారు. ఆమేరకు గురువారం అటవీ సమీప గ్రామాలైన వరికుంట్ల, బాలాయపల్లె, సావిశెట్టిపల్లె, ఆకులనారాయణపల్లె తదితర గ్రామాల్లో పోలీసులు ముందు జాగ్రత్తగా దండోరా వేయించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కరెంట్ పెట్టడంవల్ల అడవి జంతువులు, గ్రామాల్లోని మూగ జీవాలతోపాటు కరెంట్ పెట్టి రైతులు కూడా ప్రమాదవశాత్తు చనిపోతున్నారన్నారు. ఈమధ్య కాలంలో మండల వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు నమోదవుతున్నాయన్నారు. రైతులు కరెంట్ పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు జీవితబీమా పంపిణీ



బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో వివిధ అనార్యో ప్రమాదాలలో చనిపోయిన పార్టీ కార్యకర్తలకు సంక్షేమనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల ప్రమాదభీమాచెక్కులను గురువారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత నారాలోకేశ్ ఆలోచనలతో రూపుదిద్దుకున్న కార్యకర్తల సంక్షేమనిధి కుటుంబసభ్యులను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. దేశంలో ఒక్క తెలుగుదేశంపార్టీ మాత్రమే రూ.100ల ప్రమాద బీమా చెల్లించిన వారికి రూ.5లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రమాదంలో వివిధ అనారోగ్య కారణాలతో వరికుంట్ల సుబ్బయ్య, పోతాపి చిన్నయ్య, ఎంబడి చెవురమ్మ, కూరాకు జయసుబ్బారెడ్డి చనిపోగా వారి కుటుంబాలను ఆర్థిక సాయం చేశారు.

సీఎం సహాయనిధి పంపిణీ

గోపవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం పీపీ కుంట గ్రామానికి చెందిన దాసరి పొట్టెమ్మ, జగన్నాధం రమణ అనే వారికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, గోపవరం మండల వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి రూ.52 వేల చెక్కును అందించారు. సీఎం సహాయనిధి ఒక వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో మల్లిఖార్జున, పిచ్చయ్య, నారాయణ, నరసింహులు, నాగయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

బద్వేలు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మొంథా తుఫాను కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సహాయ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ కోరారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొంథా తుఫానుతో నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఏవోలు, రెవెన్యూ వీఆర్వోలు రైతుల వద్దకు వెళ్లి పంటలు ఏ మోతాదులో నష్టం అయ్యాయో సమగ్రంగా విచారణ జరపలేకపోయారని ఆరోపించారు. పంట నమోదు చేయడంలో పోరుమామిళ్ల మండలం పెద్దచెరువు కింద వందలాది మంది రైతులకు ఒక్కరికి కూడా పంట నమోదు చేయలేదన్నారు. రజాసాహెబ్ పేట నుంచి కవలకుంట్ల వరకు మొక్కజొన్న పంట పూర్తిగా నీట మునిగిందని కాశినాయన మండలంలో కొన్ని పంటలకు మాత్రమే ఈ క్రాప్ చేయడం జరిగిందన్నారు. కొన్నిపంటలకు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్నిముట్టడించి రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యవర్గసభ్యులు వెంకటరమణ, విజయమ్మ, నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్, సుధాకర్, తిరుమల ప్రసాద్, మునెమ్మ పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోండి

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం వలన తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వరి, మినుము, కంది, వేరుశనగ, మొక్కజొన్న, తదితర పంటలు రైతులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాల ని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీ ల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో సీపీఐ నగర కార్యదర్శి రవికుమార్, సీపీఐ నాయకులు ధర్నాలో పాల్గొని మా ట్లాడుతూ పోరుమామిళ్ల మండలం లో వర్షానికి మొక్కజొన్న, వరి రైతు లు పూర్తిగా నష్టపోయారన్నారు. పం టలు దెబ్బతిన్న రైతులకు తమ పంటలు నమోదు చేసుకునేందుకు గడువు పెంచా లని ఈక్రాప్‌తో సంబంధం లేకుండా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించా లన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు కెజియాకు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కలసపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్‌కు పంట నష్టంపై వినతిపత్రం అందించారు. మండల పరిధిలో ఉల్లి, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగుచేసిన రైతులుభారీగా నష్టపోయారన్నారు. వెంటనే ప్రభుత్వం మండల రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుడిమె కుమార్, రాయప్ప, నాతోనేలు, రంగయ్య, చిన్నప్ప పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: మొంథా తుఫాను వలన పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని గురువారం తహసీల్దారు గంగయ్యకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో వరి పంట సాగు చేసిన రైతులు మొంథా తుఫాను వలన తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో ప్రతి రైతుకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామకృష్ణ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు దొంగ గద్దె దిగు యాత్రకు విశేష స్పందన

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఓటు దొంగ గద్దె దిగు అవగాహన కార్యక్రమ యాత్రకు విశేష స్పందన లభించిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందని ఆయన తెలిపారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు నియోజకవర్గం మొదటిస్థానంలో, జిల్లాల వారీగా కడపజిల్లా ప్రథమస్థానంలో నిలువడం పార్టీ కార్యకర్తల కృషికి నిదర్శనమని షర్మిళారెడ్డి కొనియాడారని తెలిపారు. . నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిలోపాలులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించామని తెలిపారు.

స్మార్ట్ కిచెన్ పనులను త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న జడ్పీసీఈవో ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లె ఖాదర్‌బాద్ జడ్పీ హైస్కూలు ఆవరణలో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఓబుళమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని చౌటపల్లెలోని శానిటేషన్, తాగునీరు, ఎస్‌డబ్ల్యూపీసీలను తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో శానిటేషన్ మెరుగుపడాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ4కు సంబందించి అక్కడ సిబ్బందికి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఖాదర్‌బాద్ జడ్పీ హైస్కూలు ఆవరణంలో స్మార్ట్‌కిచెన్ భవన నిర్మాణం నాణ్యతగా ఉండాలని పంచాయతీరాజ్ ఏఈ గణేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో రామాంజనేయులు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఉప్పలపాడును సందర్శించిన అధికారులు

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఆదర్శ గ్రామమైన ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని గురువారం జిల్లా పరిషత్ సీఈవో ఓబుళమ్మ, ఇతర అధికారులు సందర్శించారు. వారు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎస్.డబ్ల్యూపీసీ సెంటర్ సందర్శించి గ్రామంలోని పారిశుద్యం గురించి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈనెల 15వ తేదీలోగా రాష్ట్ర చీఫ్ సెక్రటరి విజయానంద్ రానున్నట్లు, ఆదిశగా అధికారులు ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించి పరిశీలనలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి నూర్జహాన్, ఎంపీడీవో సైదున్నీసా, డిప్యూటీ ఎంపీడీవో శివారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుధీర్, వీఆర్వో భీమన్న పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే భూ సంరక్షణ సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన వ్యవసాయంకోసం సేంద్రియ ఎరువులను వాడడంవలన భూమి ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులోని సబాభవనంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భూమాత రక్షణ కార్యక్రమంపై డివిజనల్‌స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ పంట సాగులో దిగుబడి ఎంత ముఖ్యమో అందులో వాడే రసాయన మోతాదు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. మితిమీరిన రసాయనాలను వీడి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఏడీఏ అనిత మాట్లాడుతూ దుక్కిలో పశువుల ఎరువుల వాడటం వలన భూమిలో పోషకాల లభ్యత వేర్ల ద్వారా మొక్కలకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, ప్రొద్దుటూరు , జమ్మలమడుగు, పెద్దముడియం ఏవోలు వరహరికుమార్, శ్రీకాంత్, జాకీర్‌షరీఫ్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేసిన ఆర్డీవో

దువ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు వద్ద ఉన్న రిలయన్స్ జియో నెట్‌వర్క్‌లో పవర్ బ్యాకప్ చేసే సామగ్రిని నిలువ ఉంచే స్థలం కోసం ఆర్డీవో సాయిశ్రీ గురువారం పరిశీలన చేశారు. ఇక్కడ దీని ఏర్పాటు చేసేందుకు ఆరు సెంట్ల స్థలం అవసరం కాగా ఆర్డీవో వచ్చారని తహసీల్దారు సంజీవరెడ్డి తెలిపారు. ఇది పట్టా భూమి కాదా అనే విషయాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ జాన్సన్ వారి వెంట ఉన్నారు.

'చంద్రబాబు మెప్పు కోసమే జగన్‌పై ఆది విమర్శలు'

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెప్పుకోసమే జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగులోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. నీలాంటి తాటాకు చప్పుళ్లకు జగన్ భయపడరన్నారు. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరులో 2021లో పోలీసు స్టేషన్‌కు ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించాలనే ఆలోచనతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, పి.గిరిధర్‌రెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞానాన్ని పెంచేవాడే గురువు



పదవీ విరమణచేసిన ఉపాధ్యాయుడు ఆదిశేషారెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువు చెప్పి అజ్ఞానం అనే చీకటి తొలగించి జ్ఞానం పంచే మార్గదర్శకుడు గురువు అని మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, మండల విద్యాశాఖాధికారి కొండిశెట్టి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో రంగసముద్రం దళితవాడలో ఎస్‌జీటీ విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన బయన ఆదిశేషారెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిశేషారెడ్డి 30 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించారన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఆదిశేషారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, స్టేట్ అదనపు కార్యదర్శి రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..?

కలసపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగంపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం సమంజసంకాదని యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందికి రావాల్సిన బిల్లులు దారి తప్పడంపై ప్రశ్నించిన రావులపల్లె సచివాలయ ఉద్యానవన సహాయకులు సురేంద్రను సస్పెండ్ చేయడాన్ని ఆయన ఖండించారు. రైతు భరోసా కేంద్రాల్లో స్టేషనరీకి, మెయింటెనెన్స్, సాయిల్ శాంపిల్స్‌కి, పంట కోత ప్రయోగానికి, క్రాప్ బుకింగ్‌కి రావాల్సిన డబ్బుల్ని ఉద్యోగులకు రాకుండా మండలస్థాయి నుంచి కమిషనర్ స్థాయి వరకు నిధులు దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. ఉద్యాన సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా సురేంద్ర ఆర్‌టీఏ యాక్ట్ ద్వారా సేకరించి నిధుల దుర్వినియోగం ప్రశ్నించి న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. సురేంద్రపై సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే ఆందోళనలు చేపడతామని సిద్దేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

నేడు విద్యార్థులకు మండలస్థాయి పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న బహుళ నైపుణ్యాలను వెలికితీయడానికి శుక్రవారం వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు మానస కళాసాంస్కృతిక సమాజం అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె శ్రీనులు తెలిపారు. సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మన భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారిలోని కళానైపుణ్యాలను వెలికితీయడానికి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పద్యపఠనం, జానపద గేయాలు, జానపద నృత్యాలు తదితర పోటీలను జూనియర్స్, సీనియర్స్ విభాగాలకు నిర్వహించి వారికి ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000, తృతీయ బహుమతి రూ.750, మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

9న నగరేశ్వరునికి రుద్రాభిషేకం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఈనెల 9వ తేదీ నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఉద్యానవనంలో పార్వతీదేవి సమేత నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.